AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

16-7-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


**సూపరింటెండెంట్ రానట్టే..!** 2





**యువకుడి దారుణ హత్య** 2

## ప్రపంచ పోలీస్ ఫైర్ గేమ్స్‌లో కానిస్టేబుల్ ప్రతిభ



**అక్షరటుడే, కామారెడ్డి:** అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన ప్రపంచ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్2025లో కామారెడ్డి జిల్లా కానిస్టేబుల్ ప్రతిభ చూపాడు. షాట్‌పుట్ అండ్ 110 మీటర్ల పరుగు పందెంలో కానిస్టేబుల్ మహమ్మద్ బాబా రెండు కాంస్య పతకాలను సాధించాడు. ప్రస్తుతం ఐజీపీ స్పోర్ట్స్ హైదరాబాద్‌లో అటాచ్‌గా విధులు నిర్వహిస్తున్న మొహమ్మద్ బాబా గతనెల 27 నుండి ఈనెల 6 వరకు అమెరికాలో జరిగిన పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మహమ్మద్ బాబాను ప్రత్యేకంగా అభినందించారు.

## పెద్దపులి కోసం కొనసాగుతున్న గాలింపు

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలో పెద్దపులి కోసం అటవీ అధికారుల సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. పులి సంచారంతో రామారెడ్డి మండలంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా.. అటవీశాఖ అధికారులు అడవిలోనే మకాం వేసి పులి కోసం గాలిస్తున్నారు. మూడు రోజులుగా ట్రాకింగ్ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పెద్దపులి జాడ కోసం వెతికిన అధికారులు బుధవారం కాలినడకన అడవిలో కిలోమీటర్ల కొద్దీ జల్లెడ పడుతున్నారు. పెద్దపులి రోజుకు 20 కిలోమీటర్ల వరకు నడవ గలుగుతుందని అధికారులు చెబుతున్నారు. పెద్దపులిపై విష ప్రయోగం జరిగిందన్న ప్రచారంతో దాని ఆచూకీపై అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. నాలుగు రోజులైనా పులి జాడ దొరకక పోవడంతో హైరానా పడుతున్నారు. కామారెడ్డి, మాచారెడ్డి, ఇంద ల్వాయి, ఆర్మూర్, సిరికొండ, సిరిసిల్ల రేంజ్ అధికారులు పులి కోసం బృందాలుగా విడిపోయి గాలింపు చేపడుతున్నారు. నిజామాబాద్, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల పరిధిలో అంతటా ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేసినా.. ఎక్కడ పులి జాడ రికార్డు కాలేదు.

## మాజీ మంత్రికి కనువిప్పు కలిగిస్తాం





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** గల్ఫ్ బాధిత కుటుంబాల పట్ల మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు, కార్పొరేషన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ మంత్రి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయనకు వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంతో వేల్పూర్‌లో గురువారం కనువిప్పు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో గల్ఫ్ బాధిత కుటుంబాలను పట్టించుకోని ప్రశాంత్‌రెడ్డి, నేడు వారి సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లాలనే దురాలోచనతో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చర్చించడానికి డీసీసీ అధ్యక్షుడిగా తనతో పాటు బాల్కొండ ఇన్‌ఛార్జి సునీల్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి కనువిప్పు కార్యక్రమానికి వస్తున్నామన్నారు. ప్రశాంత్‌రెడ్డికి నీతి ఉంటే వేల్పూరులో నిర్వహించే కార్యక్రమానికి రావాలని సవాల్ విసిరారు.

## మహిళలను లక్షాధికారులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**అక్షరటుడే, బోధన్:** మహిళలను లక్షాధికారులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎడపల్లిలో బుధవారం నిర్వహించిన ఇందిర మహిళ శక్తి సంబరాల్లో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి.. వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ ఛైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంగాధర్ ఐకేపీ పీడీ సాయగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# చెక్ పోస్టులపై ఏసీబీ నజర్





**ఆర్టీఏ చెక్ పోస్టులు వసూళ్లకు అడ్డాగా మారుతున్నాయి. ప్రతి రోజూ వచ్చి పోయే వాహనాల నుంచి ఆర్టీఏ సిబ్బంది, అధికారులు ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. చెక్ పోస్టుల వద్ద వసూళ్లపై ఫిర్యాదులు రావడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద దాడులు చేపడుతున్నారు. కామారెడ్డి జిల్లాలో 20 రోజుల వ్యవధిలో రెండు చెక్ పోస్టులలో అనిశా అధికారులు దాడులు చేయడం, అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా దొరకడం చర్చనీయాంశంగా మారింది.**

**– అక్షరటుడే, కామారెడ్డి**


- వరుస దాడులతో అధికారుల్లో గుబులు
- 20 రోజుల వ్యవధిలో రెండోసారి అనిశా దాడులు
- పొందుర్తి చెక్ పోస్టు వద్ద రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన సిబ్బంది
- ఏసీబీ దాడులతో బోసిపోయిన ఆర్టీవో కార్యాలయం

జిల్లాలో ఏసీబీ అధికారులు అవినీతి అధికారుల బాగోతం బట్టబయలు చేసే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ముఖ్యంగా ఆర్టీఏ చెక్ పోస్టుల వద్ద ఇష్టారాజ్యాంగా వసూళ్ల పర్వం కొనసాగుతుండడంతో రంగంలోకి దిగి అవినీతి అధికారుల ఆట కట్టిస్తున్నారు. గత నెల 26న మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న మద్నూర్ మండలం సలాబత్‌పూర్ చెక్ పోస్టుపై దాడులు చేసిన ఏసీబీ అసిస్టెంట్ ఎంవీఐ, సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించింది. అనిశా దాడుల్లో దాదాపు రూ. 93 వేలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా.. రాజంపేట మండలం పొందుర్తి చెక్ పోస్టుపై ఏసీబీ అధికారులు దాడులు చేయడం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

### రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత

పొందుర్తి చెక్ పోస్టు వద్ద వచ్చి పోయే వాహనాల నుంచి





ఇక్కడి సిబ్బంది ఇష్టారీతిన వసూళ్లు చేస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పొందుర్తి చెక్ పోస్టు వద్ద జరిపిన దాడులో లారీ డ్రైవర్ల నుంచి చెక్ పోస్టు సిబ్బంది డబ్బులు తీసుకుంటుండగా చెక్ పోస్టు సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అసిస్టెంట్ ఎంవీఐ శ్యామ్, సిబ్బంది వద్ద ఉన్న డబ్బులు, ప్రైవేట్ సిబ్బంది వద్ద ఉన్న డబ్బులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎంవీఐ, సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తులను అధికారులు విచారించారు. మరోవైపు ఏసీబీ అధికారులు చెక్ పోస్టు సిబ్బంది స్థానంలో కౌంటర్ వద్ద కూర్చోగా చెక్ పోస్టు సిబ్బందే కదా అనుకుని లారీ డ్రైవర్లు ఏసీబీ అధికారులకు ముడుపులు ఇచ్చి వెళ్లారు.

### గతంలో రెండు సార్లు మిస్

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొట్టమొదటి సారిగా రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో ఆర్టీఏ చెక్ పోస్టులపై ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఆ సమయంలో పొందుర్తి చెక్ పోస్టుపై కూడా దాడులు జరుగుతాయని ప్రచారం జరిగినా అలాంటిదేమి జరగలేదు. రెండోసారి మద్నూర్ సలాబత్ పూర్ చెక్ పోస్టు వద్ద దాడుల సమయంలో కూడా ఇక్కడ దాడులు జరుగుతాయని ప్రచారం సాగింది. మూడో సారి అనుకోకుండా ఏసీబీ అధికారులు దాడులు చేయడంతో ఒక్కసారిగా అధికారుల్లో అలజడి మొదలైంది. చెక్ పోస్టు వద్ద ఏసీబీ దాడులతో ఆర్టీవో కార్యాలయం బోసిపోయింది. ఆర్టీవో కార్యాలయం వద్దకు కూడా ఏసీబీ అధికారులు వస్తారేమోనన్న భయంతో అక్కడ మధ్యవర్తులుగా ఉండే బ్రోకర్లు ఒక్కరు కూడా కనిపించలేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఆర్టీవో కార్యాలయం వెలవెలబోయింది.

### రూ.80 వేలు సీజ్ చేసిన అధికారులు

పొందుర్తి చెక్ పోస్టు వద్ద జరిపిన ఏసీబీ దాడుల్లో మొత్తం లెక్కచూపని రూ.80వేల నగదును సీజ్ చేశారు. ఏసీబీ దాడుల సమయంలో అసిస్టెంట్ ఎంవీఐ శ్యామ్ రిచర్డ్‌సన్ వద్ద రూ.16వేలు, ప్రైవేట్ ఏజెంట్ శివకుమార్ వద్ద రూ.9వేలు, కార్యాలయంలో దొరికిన రూ.4వేలు స్వాధీనం చేసుకున్నారు. మిగతా డబ్బులు లారీ డ్రైవర్ల ద్వారా వచ్చినట్లు తెలిపారు. మొత్తం రూ.80 వేల నగదుతో పాటు 30 ఫోన్లను సీజ్ చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధి కారులపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**అక్షరటుడే, ఇందూరు:** శానిటేషన్ కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రవిబాబు అన్నారు. 'నమస్తే డే'లో భాగంగా బుధవారం శానిటేషన్ కార్మికులకు పీపీఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా కార్మికులు అనేకచోట్ల వెళ్లాల్సి ఉంటుందన్నారు. కావున ఆరోగ్యం పై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీపీఈ కిట్లతో పాటు కార్మికులకు ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేశారు. ఎటువంటి అనారోగ్య సమస్య వచ్చిన కార్డు ద్వారా ఆస్పత్రులకు వెళ్లాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, డ్రైవర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.





నగరానికి చెందిన పుప్పాలరవి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం స్నాతకోత్సవం నిర్వహించారు. 2003లో తెలుగు డీన్ కనకయ్య ఆధ్వర్యంలో 'తెలంగాణ కార్మికుల జీవితాలు.. తెలంగాణ గల్ఫ్ వలస కార్మికుల బతుకు'పై స్పెషలైజేషన్ చేసిన సందర్భంగా డాక్టరేట్ వచ్చింది.



తెలంగాణ వర్సిటీలోని మాస్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఈ.శ్రీనివాస్ గౌడ్ కాంట్రిబ్యూషన్ తెలంగాణ డైరెక్టర్ టు ది తెలుగు సినిమా అనే అంశంపై ప్రొ.శివశంకర్ పర్యవేక్షణలో పరిశోధన చేసి తీసిస్‌ను సమర్పించడం జరిగింది. ఈ రోజు వర్సిటీలో 2వ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పీహెచ్‌డీని అందుకోవడం జరిగింది. కార్యక్రమంలో వీసీ ప్రొ.యాదగిరి రావు, రిజిస్ట్రార్ ఎం.యాదగిరి సోషల్ సైన్స్ డీన్ ప్రొ.ఘంటా చంద్రశేఖర్ అధ్యాపకులు పాల్గొన్నారు.





తెలంగాణ యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవం సందర్భంగా ఫిజిక్స్ విభాగం నుంచి ఏకైక పరిశోధక విద్యార్థి కర్క గణేష్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఫిజిక్స్ విభాగం, కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.



తెలంగాణ వర్సిటీ రెండో స్నాతకోత్సవంలో ఇంటిగ్రేటెడ్ ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్ (2016-2021) సంవత్సరానికి రాచకొండ విగ్నేష్ (ప్రస్తుతం ఎస్ఎఫ్ఐ నిజామాద్ జిల్లా కార్యదర్శి) రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గారి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం జరిగింది. ఉద్యమాలలోనే కాదు చదువులో ముందుండవారే ఎస్ఎఫ్ఐ విద్యార్థులను ప్రొఫెసర్లు అభినందించారు. కాన్వకేషన్ డే స్ఫూర్తితో కార్ల్ మార్క్స్ ఎంగెల్స్ నిర్దేశించిన సోషలిజం వైపుగా సమాజాన్ని మేల్కొల్పడానికి కృషి చేస్తాను.

# రాష్ట్రంలో తెలంగాణ వర్సిటీకి ప్రత్యేకస్థానం





**అక్షరటుడే, డిచ్‌పల్లి:** రాష్ట్రంలో తెలంగాణ యూనివర్సిటీకి ప్రత్యేకస్థానం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం రెండో స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ, గోల్డ్ మెడలిస్ట్‌లకు పట్టాలను ప్రదానం చేశారు.అనంతరం గవర్నర్ ప్రసంగిస్తూ.. తెలంగాణ యూనివర్సిటీ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. చైతన్యవంతమైన ఈ మట్టిలోని ప్రజల ఆకాంక్షలు, సామర్థ్యాలు విశ్వవిద్యాలయ అభివృద్ధిలో స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విశ్వవిద్యాలయం సాధించిన విజయాలు, విశేషమైన ప్రగతి పూర్వకమైన సంఘటనలు రాష్ట్రానికే ఆదర్శంగా



నిలిచాయని గవర్నర్ స్పష్టం చేశారు.

### 2006లో ఆరు కోర్సులతో ప్రారంభమై..

2006లో ఆరు కోర్సులతో ప్రారంభమై నేడు ఏడు విభాగాల్లో 24 ఉప విభాగాలుగా అభివృద్ధి చెందిందన్నారు. 31 కోర్సులతో భిక్కనూరు, సారంగపూర్ క్యాంపస్‌లుగా విస్తరించి వర్సిటీ విద్యనందిస్తోందన్నారు. స్నాతకోత్సవం ఏర్పాట్లు చేయడమనేది కేవలం విద్యాపరమైన లక్ష్యసాధనలో విజేతలుగా నిలిచిన వారికోసమే కాదని.. వారిని స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు ఇదేబాటలో నడిచేందుకని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొఠారి కమిషన్ చెప్పినట్లుగా దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్దబడుతుందనేది తెయూ నిరూపిస్తోందన్నారు. అనంతరం భారత రసాయన శాస్త్ర సాంకేతిక సంస్థ మాజీ డైరెక్టర్ ఆచార్య శ్రీవారి చంద్రశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుంచి బయటకు వెళ్లిన ప్రతి విద్యార్థికి ఆందోళనతో పాటు అవకాశాలు లభిస్తాయని.. ఆందోళన చెందకుండా అవకాశాల వైపు పరుగెత్తాలని సూచించారు. వీసీ యాదగిరిరావు మాట్లాడుతూ సమీప భవిష్యత్తులో ఇంజినీరింగ్ ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### బాలికల హాస్టల్, ఆడిటోరియం..

పరిపాలనా భవనం 500 మంది విద్యార్థినుల కోసం హాస్టల్‌ను, ఆడిటోరియం, క్రీడా మైదానం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని సూచించారు. ఈ స్నాతకోత్సవంలో 15 విభాగాల్లో 2014 నుంచి 2023 వరకు 132 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు. 156 మంది పరిశోధకులకు డాక్టరేట్ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేశ్‌రెడ్డి, డీన్స్ గంటా చంద్రశేఖర్, అపర్ణ, రాంబాబు, లావణ్య, శ్రీనివాసులు ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, హారతి, నాగరాజు, కనకయ్య, పీఆర్వో పున్నయ్య పాల్గొన్నారు.



## జిల్లా ప్రముఖులతో గవర్నర్ ఇష్టాగోష్టి..

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో జిల్లాకు చెందిన ఆయా రంగాల్లో ప్రఖ్యాతిగాంచిన కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలతో ఇష్టాగోష్టి నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కలెక్టరేట్‌కు విచ్చేశారు.



# జీజీహెచ్ సూపరింటెండెంట్ రానట్టే..!




■ ఇటీవల కృష్ణ మాలకొండ రెడ్డిని నియమించిన ప్రభుత్వం ■ ఇక్కడికి రావడానికి అనాసక్తి ■ వారం గడుస్తున్నా బాధ్యతలు స్వీకరించని వైనం ■ ఇన్‌ఛార్జీల పాలనలోనే జీజీహెచ్

**జిల్లా జనరల్ ఆస్పత్రికి ప్రభుత్వం ఇటీవల పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌ను నియమించింది. దీంతో ఆస్పత్రి దశ తిరుగుతుందని.. సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా ప్రజలు ఆశించారు. ఏళ్లుగా ఇన్‌ఛార్జీ అధికారుల పాలనలో ఉన్న ఆస్పత్రికి పూర్తి స్థాయి అధికారి వస్తున్నాడని ఆనందపడ్డారు. కానీ వారి ఆశలు అడియాసలయ్యాయి.**

**– అక్షరటుడే, ఇందూరు**

జీజీహెచ్‌కు సూపరింటెండెంట్‌గా నియామకమైన కృష్ణ మాలకొండ రెడ్డి ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపడం లేదని సమాచారం. దీంతో జనరల్ ఆస్పత్రి కథ మళ్లీ మొదటికి వచ్చినట్లేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని అన్ని జీజీహెచ్‌లు, మెడికల్ కాలేజీలకు పూర్తిస్థాయి అధికారులను నియమించింది. సూపరింటెండెంట్, ప్రిన్సిపాళ్లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా కృష్ణ మాలకొండ రెడ్డిని, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణ మోహన్‌ను నియమించింది. నూతన ప్రిన్సిపాల్ బాధ్యతలు స్వీకరించారు. కానీ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా మాలకొండ రెడ్డి వారం గడుస్తున్నా బాధ్యతలు స్వీకరించలేదు.

### జిల్లాకు రావడానికి విముఖత

ఉస్మానియా మెడికల్ కాలేజీలో కార్డియాలజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణ మాలకొండ రెడ్డికి ప్రభుత్వం పదోన్నతి కల్పించి, నిజామాబాద్ జీజీహెచ్‌కు పంపించింది. ఈ మేరకు ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి రిలీవ్ కూడా చేశారు. అయితే ఆయన జిల్లాకు రావడానికి ఆసక్తి చూపడం లేదని సమాచారం. హైదరాబాద్‌లో స్థిర పడిన ఆయన ఇక్కడకు రావడం ఇష్టం లేక కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. తన రిలీవింగ్‌ను క్యాన్సిల్ చేసి అక్కడే కొనసాగించాలని ఆయన కోరుతున్నట్లు సమాచారం.

### పదోన్నతి వదులుకుంటారా..

డాక్టర్ కృష్ణ మాలకొండ రెడ్డి పదోన్నతిపై జీజీహెచ్ పర్యవేక్షకులుగా నియమితులయ్యారు. అయితే ప్రస్తుతం హైదరాబాద్‌లో మంచి ప్రాక్టీస్ ఉందనే కారణంతో జిల్లాకు రావడం లేదని ఆస్పత్రి వర్గాలు చర్చించుకుంటున్నాయి. దీంతో ఆయన తన ప్రమోషన్‌ను కూడా వదులుకోవడానికి సిద్ధపడ్డట్లు సమాచారం. గతంలోనూ రాష్ట్రంలో అనేక మంది వైద్యులు హైదరాబాద్‌ను వదిలి రావడం ఇష్టం లేక తమ పదోన్నతులను వదులుకున్నారు.

### పదేళ్లుగా ఇన్‌ఛార్జీలే..

జిల్లా జనరల్ ఆస్పత్రిని పదేళ్లుగా ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్లు పాలిస్తున్నారు. రాములు, చంద్రశేఖర్, బన్సీలాల్, ప్రతిమారాజ్, శ్రీనివాస్ తదితరులు ఇన్‌ఛార్జీలుగా వ్యవహరించారు. ప్రస్తుతం రెగ్యులర్ నియామకాలు చేపట్టడంతో ఆస్పత్రి సేవలు పటిష్టమవుతాయని పలువురు భావించారు. కానీ కృష్ణ మాలకొండ రెడ్డి బాధ్యతలు చేపట్టకపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. అయితే ఇన్‌ఛార్జీగా డాక్టర్ శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. ఆయన సెలవులో ఉండడంతో రాములుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే పలు విభాగాల్లో ఖాళీలతో వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి.

## బీజేవైఎం మండల కార్యవర్గం



**అక్షరటుడే, ఆర్మూర్ :** బీజేవైఎం నందిపేట మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పటేళ్ల రాజు ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు మంగ్లారపు నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో ఉపాధ్యక్షులుగా రొక్కడి సాగర్, ఎల్లోళ్ల అజయ్, మస్కూరి శ్రీకాంత్, అర్వింద్, తరుణ్ యాదవ్, తొంటి శేషు, జనరల్ సెక్రెటరీలుగా మన్మోహన్, ఏషాల చందు, సుమన్, అధికార ప్రతినిధులుగా రాజారాం రితీష్, నిఖిల్ కాంత్‌ను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని, పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



**అక్షరటుడే, నిజాంసాగర్:** తమ సమస్యలు పరిష్కరించాలని నిజాంసాగర్ మండలంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో గంగాధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని, దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇప్పటికైనా తమ సమస్య పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

## స్కాలర్‌షిప్ కోసం సీఎంకు పోస్టు ద్వారా అర్జీ




**అక్షర టుడే, గాంధారి:** విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గాంధారిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని విద్యార్థులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు ద్వారా అర్జీ పంపినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. విద్యారంగ అభివృద్ధికి ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి



**అక్షరటుడే నిజాంసాగర్:** విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఎంఈవో అమర్‌సింగ్ సూచించారు. మహమ్మద్‌నగర్‌లోని నర్వ గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుపట్టిను ఆయన పరిశీలించారు. పాఠశాలకు విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని హెచ్‌ఎంకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దఫేదార్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బహుజన అలయ్‌బలయ్ సభకు ఆహ్వానం




**అక్షరటుడే, బాన్సువాడ:** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న కామారెడ్డి పట్టణంలో రాజ్యాంగ పరిరక్షణ అలయ్‌బలయ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు బుధవారం ప్రభుత్వ సలహాదారు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కార్యక్రమానికి రావాలని ఆహ్వానం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టెంకి బాలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైసయ్య, రాష్ట్ర కార్యదర్శి నెర్రె నర్సింహులు, డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, గైన రవి, మన్నే చిన్న సాయిలు, రాజు, మామిడి భూమయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ నాయకుల ముందస్తు అరెస్ట్



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం వారిని అరెస్ట్ చేసి నాలుగో టౌన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, జిల్లా నాయకులు నిఖిల్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెయూ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్నాతకోత్సవానికి యూనివర్సిటీ విద్యార్థులను పిలవకపోవడం విచారకరమని వారన్నారు. ముఖ్యంగా యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను వివరించేందుకు గవర్నర్‌ను విన్నవించాలని భావించామన్నారు.



చుట్టూ పచ్చని చెట్లు.. మధ్యలో నల్లటి తారురోడ్డు చూపరులను ఆకట్టుకుంటోంది. రోడ్డుకు ఇరువైపులా పచ్చటి తోరణంలా పెరిగిన చెట్లు కనువిందు చేస్తున్నారు. డిచ్‌పల్లి బెటాలియన్‌కు వెళ్లే ఈ మార్గంలో ప్రకృతి రమణీయ దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది. – అక్షరటుడే, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్

## పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. నిజాంసాగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పీఎంఏవై పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ గంగాప్రసాద్, ఈజీఎస్ సిబ్బంది శివ, ఏపీఎం, ఎఫ్ఏలు, టీఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం



**అక్షరటుడే, నిజాంసాగర్:** పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని '108'లో తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది అంబులెన్స్‌లోనే డెలివరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన లక్ష్మిని డెలివరీ కోసం బుధవారం నిజాంసాగర్ ప్రభుత్వ ఆస్పత్రికి '108'లో సిబ్బంది తీసుకెళ్లారు. అయితే అక్కడి వైద్యులు బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో గర్భిణిని బాన్సువాడ ఆస్పత్రికి తరలిస్తుండగా.. పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో క్లిష్ట పరిస్థితుల్లో '108' సిబ్బంది డెలివరీ నిర్వహించారు. ఆమెకు మగబిడ్డ జన్మించగా.. వారిరువురు క్షేమంగా ఉన్నారు. డెలివరీ అనంతరం తల్లీబిడ్డలను బాన్సువాడ ఆస్పత్రి కి తరలించారు. కాన్పు చేసిన ఈఎంటీ అరవింద్, పైలెట్ వెంకటేష్‌కు లక్ష్మి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

## యువకుడి దారుణ హత్య

**అక్షరటుడే, బిచ్కుంద:** బిచ్కుందలో యువకుడి దారుణ హత్య కలకలం రేపింది. బుధవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి కత్తితో నరికి హత్య చేశాడు. ఎస్సై మోహన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన అడికెవారి రమేష్ (40) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కాగా అతడికి పదేళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు సంతానం ఉన్నారు. ఏడాది క్రితం భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో రమేష్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అయితే హైదరాబాద్‌లో నివసించే కాశీనాథ్ అనే వ్యక్తి బుధవారం ఉదయం మండల కేంద్రానికి వచ్చాడు. రమేష్ ఉంటున్న ఇంటివద్ద కాపుకాసి కత్తితో దాడి చేశాడు. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. కాగా.. వివాహేతర సంబంధమే హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది.

## ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బెజ్జోర, లింగాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో సంతోష్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు రూ.లక్ష నగదు ఖాతాల్లో జమచేసినట్లు పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని గుత్తేదారుకు సూచించారు. ఆయన వెంట ఉపాధి హామీ ఏపీవో నర్సయ్య, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## పింఛన్లు పెంపు హామీని అమలు చేయాలి



**అక్షరటుడే, కోటగిరి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పింఛన్‌ను రూ.4016 నుంచి రూ.6016కు పెంచాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కోటగిరి మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సోంపూర్ పోచిరాం విలేకరులతో బుధవారం మాట్లాడారు. దివ్యాంగులకు ప్రస్తుతం ఉన్న పింఛన్‌ను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 18న జిల్లా కేంద్రంలో నిర్వహించే సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులు, ఇతర పింఛన్‌దారులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం మండల బాధ్యులు శ్రీనివాస్, శివకుమార్, నాగవ్వ, సావిత్రి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలి



**అక్షరటుడే నిజాంసాగర్:** మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని పిట్లం మండలంచిన్నకొడప్‌గల్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో బుధవారం నిరసన తెలిపారు. గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయని గ్రామస్థులు పేర్కొన్నారు. లీకేజీతో నీళ్లన్నీ రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కావట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందిం సమస్య పరిష్కరించాలని కోరారు.